## కథ

# సత్యం

**కె.వి. రామదాస్**

**కాలనీ ప్రెసిడెంటుగా రాబోయే ఆదివారం సభ్యులందర్నీ అర్ధాంతర సమావేశానికి హాజరు కమ్మని నోటీసు జారీ చేయాల్సి రావడం నాకు ఒకింత బాధని కలిగించింది. కాలనీ సభ్యుడు సత్యంని నలుగురూ నిలదీయడమే ఆ సమావేశ ముఖ్యోద్దేశం.**

**సత్యం ఎలాంటివాడో నాకు బాగా తెలుసు. అందుకే నా బాధంతా! సత్యం పేరుకు తగ్గట్టే 'సత్య హరిశ్చంద్రుడు'. నలుగురి మధ్యా దోషిలా నిలబడవలసినంత నేరమైతే అతడేం చేసుండడని నా బలమైన నమ్మకం. కాలనీ వాసుల వత్తిడికి తలొగ్గి సత్యంని సమావేశానికి హాజరు కమ్మని ప్రత్యేకంగా చెప్పాల్సొచ్చింది.**

ఒకసారి సత్యాన్ని మాటల్లో అడిగాను ''మీ తల్లిదండ్రులు నీకు సరిగ్గా 'సత్యం' అని పేరెలా పెట్టా''రని! దానికి అతడు చిరునవ్వు నవ్వి, ''మా నాన్నకి ఎప్పుడూ నిజం మాట్లాడేవారంటే చాలా యిష్టం. అందుకే నాకు 'సత్యం' అని పేరు పెట్టి నన్ను ఎప్పుడూ నిజం మాట్లాడమని ఉగ్గుపాలతో పెంచారు. అది నా నరనరాన్ని జీర్ణించుకుపోయింది'' అంటూ సమాధానం యిచ్చాడు.

సత్యం ఎంతటి సత్యవంతుడంటే, చిన్న అబద్ధం చెబితే చాలా మంచి జరుగుతుందన్నా, అబద్ధాల జోలికి పోని వ్యక్తి. అదిగో! సరిగ్గా అక్కడే వచ్చింది చిక్కంతా! నేటి ప్రపంచానికి సత్యంలాంటి వాళ్లు ఎవరిక్కావాలి? అతని సత్యవాక్య పరిపాలన మూలంగా యిరుగుపొరుగులకి ఎంతో యిబ్బంది! మీదు మిక్కిలి తన పనేదో తాను చేసుకుపోయే రకం కాదాయె! నలుగురికీ అంతో యింతో మేలు చెయ్యాలనే దుగ్ధకొద్దీ యిరుగు పొరుగుల మంచి, చెడుల్లో తలదూర్చడం, ఆపై కుండబద్దలు కొట్టే మాటతీరుతో ఇతరులని ఇబ్బంది పాలు చెయ్యడం పరిపాటైపోయింది.

సత్యం మూలంగా మా కాలనీలో వుంటున్న చిరుద్యోగి చిదంబరానికీ, రచయిత రంగారావుకి తీవ్రంగా నష్టం కలిగిందని నాతో చెప్పుకుని ఏడ్చినంత పని చేసారు. కమిటీ సమావేశంలో అతడ్ని కడిగివేయాల్సిందేనని వారు పట్టుబట్టడం ఈ అర్ధాంతర సమావేశం తప్పని సరైంది.

సత్యం మూలంగా నేనూ ఒకటి, రెండు సార్లు యిరకాటంలో పడ్డ మాట వాస్తవమే. ఒకసారి మా ఆవిడ పొరపాటున, ''మా ఆయన యింకా యింటికి రాలేదు. ఎక్కడైనా చూసారా అన్నయ్యగారూ?'' అని సత్యాన్ని అడిగింది.

''రఘురామ్ సాయంత్రం ఐదింటికే ఆఫీసు నుండి బైక్ మీద బయలుదేరాడు, అన్నట్టు! వెనకాలే ఒకామె కూడా వుంది! ఏం? రాలేదా?'' అన్నాడు.

అదిగో ఆ నిజమే మా ఆవిడ స్త్రీ సహజ లక్షణమైన అనుమానాన్ని తట్టి లేపింది. నేను యిల్లు చేరానో లేదో పెద్ద రగడ. చివరికి నాతో బైక్ ఎక్కింది నా కజిన్ సిస్టర్ అని చెప్పి ఆమెను శాంతపరిచేసరికి తలప్రాణం తోక్కొచ్చింది.

'ఎంకి పెళ్ళి సుబ్బి చావుకొచ్చిందన్నట్టు' సత్యం నిజాయితీ మూలంగా మా కాలనీ వాసులందరికీ చావొచ్చిపడింది. అయితే అతడు అందరూ అనుకునేటంత ప్రమాదకారి మాత్రం కాదన్నది నా ఉద్దేశం. చిదంబరానికీ, రంగారావుకీ అతడి మూలంగా నష్టం జరిగిందని తెలుసుకుని నిజానిజాలేమిటో వేరు వేరుగా ఆ యిద్దర్ని కలిసి మాట్లాడి తెలుసుకోవాలనుకున్నాను.

★ ★ ★

''రండి! రఘురామ్‌గారూ!'' అంటూ నన్ను సాదరంగా ఆహ్వానించాడు చిదంబరం.

''ఏంవోయ్! సత్యంతో ఏంటంటా నీ గొడవ?''

''ఏం చెప్పమంటారు సార్? నా చెల్లెలి పెళ్ళి బాధ్యత నాదేనని మీకు తెలుసాయే! నాదా అంతంత సంపాదనాయే! ఈమధ్యే ఓ పెళ్ళివాళ్లు పిల్ల నచ్చిందనీ, ఓ యాభై వేలు కట్నం యిస్తే చాలు నా చెల్లెల్ని పెళ్ళి చేసుకుంటామని చెప్పి వెళ్లారు. మంచి సంబంధమని, తల తాకట్టు పెట్టైనా సంబంధం ఖాయం చేసుకుందామని పర్సనల్ లోన్‌కై ఓ ప్రైవేటు బ్యాంకుకి ఎప్లై చేసా. వారు ఎంక్వయిరీకొచ్చి నా యిల్లెక్కడని సరిగ్గా మన సత్యాన్నే అడిగారు. యిల్లెక్కడో చెప్పి ఊరుకోవాలా? ఊఁహూఁ.. ఎక్కడ్నించొచ్చారు? ఎందుకొచ్చారు? అంటూ ఆరాలు తీసి విషయం కనుక్కున్నాడు. అక్కడితోనైనా ఊరుకున్నాడా?... లేదే! నాకు అప్పు తీర్చే స్తోమత లేదని... లోన్ సేంక్షన్ చేస్తే నష్టపోతారని చెప్పి మరీ పంపాడు. దాంతో డబ్బు దొరికే ఒకే ఒక్క మార్గం మూసుకుపోయింది. సత్యం చెప్పింది నిజమే కావొచ్చు, కానీ వంద అబద్ధాలాడైనా ఓ పెళ్ళి చెయ్యమన్నారుగా పెద్దలు! ఏం.. నోరు మూసుకుని తన దారిన తాను పోవచ్చుగా! అతడి మూలంగా నా చెల్లెలి పెళ్ళి ఆగిపోయేదే! కానీ దేవుడి దయవల్ల మగపెళ్ళి వారు ఈ ఉదయమే ఫోన్ చేసి, పిల్ల నచ్చడం వలన కట్నం అవసరం లేదని చెప్పి సంబంధం ఒప్పుకున్నారు. అదే వారు కట్నంకోసం పట్టుపట్టుంటే, నా పరిస్థితి ఏంటి?'' ఏడ్చినంత పని చేసి వివరించాడు.

విషయం అర్థమైన నాకు చిదంబరం చెప్పిందాంట్లో న్యాయం వుందనిపించింది. సత్యం విషయం మీటింగులో తేలుద్దాంలే అని ఓదార్చి వచ్చేసాను.

ఆ మర్నాడు రంగారావుని కలవడానికి వెళ్ళాను. వచ్చిన పని చెప్పి, అసలు విషయం ఏంటని అడిగాను. దానికి రంగారావు-

''సార్! నా రచనా పటిమ గురించి మీకే కాదు, ఈ ఊరందరికి అంతో, యింతో తెలిసిందేగా! నా కళకి గుర్తింపుగా సన్మానం చెయ్యాలని 'కళామాత' అనే సంస్థ నుండి కొందరు ఆర్గనైజర్స్ వచ్చారు. నిజానికి ఎప్పటి నుండో సన్మానం చేయించుకోవాలన్న కోరిక నాలో బలంగా వుంది. కలసి వచ్చిన ఈ అవకాశానికి ఉప్పొంగి పోయాను. సరిగ్గా అదే సమయానికి మన సత్యం ఎక్కడి నుండో ఊడిపడి ఆ ఆర్గనైజర్స్‌తో ఈ సన్మానం అవ

సరం లేదనడమే కాక మీదుమిక్కిలి సన్మానించడానికి మీకున్న అర్హతేమిటని వచ్చినవారిని తిట్టి



పంపేసాడు. ఇతరుల అర్హతల్ని నిర్ణయించే అధికారం సత్యంకి ఏం వుందంటా? ఇదేదో రేపు మీటింగులో తేల్చి మళ్ళీ ఎవరి జోలికి పోకుండా చూడండి!'' సన్మానం ఛాన్సు మిస్సయిందన్న బాధ స్పష్టంగా ధ్వనించింది అతడి మాటల్లో.

రంగారావు మాటల్లోనూ కొంత న్యాయముందనిపించింది నాకు. ఏమైనా చిదంబరం, రంగారావుల విషయంలో యింకా లోతుగా విషయ సేకరణ చేసి సత్యంపై ఒక నిర్ణయానికి రావాలని నిర్ణయించుకున్నాను.

★ ★ ★

సత్యంని కలసి, మర్నాడు మీటింగ్‌కి రావలసి వుంటుందని చెప్పి ''అసలు ఎందుకొచ్చిన గొడవయ్యా నీకు?'' అన్నాను.

సత్యం నవ్వాడు వేదాంతిలా-

''పువ్వు పరిమళాన్నీ సూర్యుడి వెలుగునీ ఎలాగైతే ఆపలేమో, నిజం మాట్లాడే గుణాన్ని నేను ఆపుకోలేను. ఎవరికోసమో నా స్వభావాన్ని మార్చుకోలేను''

''బాగుంది! మనం సంఘజీవులం! మనం చేసేది ఒప్పే కావచ్చు, కానీ అది నలుగురినీ నొప్పించేదై వుండకూడదు''

''నొప్పించడమా? ఎవర్ని? ఆ చిదంబరం, రంగారావులనా?'' విరగబడి నవ్వాడు సత్యం.

ఎందుకలా నవ్వుతున్నావని సత్యంని తరచి తరచి అడిగిన మీదట అతడు చెప్పింది వినీ నేను నమ్మలేకపోయాను. నిజంగా సత్యం లాంటి ఆణిముత్యం ఈ కాలంలో వుండవలసినవాడు కాదనుకున్నాను. యిప్పుడు సత్యం నా దృష్టిలో మరింత ఎదిగిపోయాడు.

'అవును, మీటింగ్ పెట్టాలి! ఖచ్చితంగా మీటింగ్ పెట్టి సత్యం గురించి నలుగురికీ అర్థమయ్యేలా చెప్పా




లని' స్థిరంగా నిశ్చయించుకుని యింటి ముఖం పట్టాను.

★ ★ ★

ఆదివారం!

ఉదయం పది గంటలైంది.

కాలనీ వాసులంతా ఒక్కొక్కరే కమ్యునిటీ హాల్లోకి వచ్చి చేరారు. చిదంబరం, రంగారావు ఒక వైపు కూర్చుంటే, సత్యం వారికెదురుగా కూర్చున్నాడు. మీటింగ్ ప్రారంభిస్తూ కాలనీ వాసుల్ని ఉద్దేశించి నా ప్రసంగాన్ని మొదలుపెట్టాను.




''ఈ ప్రత్యేక సమావేశానికి హాజరైన అందరికీ ముందుగా నా ధన్యవాదాలు! యిక విషయానికి వస్తే, సత్యం మీద వచ్చిన అభియోగాల్లో నిజానిజాలు ఏమిటో తేలుద్దామని ఈ సమావేశం ఏర్పాటు చేసాను'' అని కాసేపాగాను.

ముందుగా చిదంబరాన్ని, ఆ తరువాత రంగారావుని తమ ఆరోపణలని వినిపించుకోమన్నాను. ఆ యిద్దరు ఒకరి తరువాత ఒకరు తమ ఆరోపణలని వినిపించీ, సత్యంపై చర్య తీసుకోవాలని గట్టిగా కోరారు.

తిరిగి నేను కాలనీవాసులని ఉద్దేశించి మాట్లాడాను.

''అందరికీ మన సత్యం తత్వం గూర్చి తెలిసిందే! కుండబద్దలు కొట్టేటట్టు మాట్లాడడమే అతడు చేసుకున్న పాపం. 'సత్యమునే పలకవలెను, అబద్ధాలు ఆడరాదు' అంటూ స్కూల్లో మాష్టార్లూ, యింటి దగ్గర పెద్దోళ్ళు పిల్లలకి నేర్పుతారు. సామాన్యులు ఆ నీతిని మరచిపోతారు. కానీ సత్యం నరనరాన ఈ నీతిని జీర్ణించుకున్నాడు. అందుకే నేటికీ ఆ నీతికి కట్టుబడి, వున్నదున్నట్లు మాట్లాడతాడు. అదేనా అతడు చేసిన నేరం? ఏమయ్యా! చిదంబరం! సత్యం మూలంగా నీ చెల్లెలి పెళ్ళి ఆగిపోవలసిందా? కానీ, 'దేవుడి' దయవల్ల ఎలాగో సంబంధం నిలిచిందా?'' అంటూ చిదంబరం వైపు జాలిగా చూసాను.

''అవును. లేకపోతే ఈ సత్యం మూలంగా చెల్లెలి పెళ్ళి చేయలేక, అసమర్థుడిగా మిగిలిపోయేవాడినే'' ఆవేశంగా అన్నాడు చిదంబరం.

''పొరపాటు, చిదంబరం..! అసలు నిజం తెలిస్తే నువ్విలా మాట్లాడవు. నీ చెల్లెలు బాగా నచ్చే ఆ పెళ్ళివారు మనసు మార్చుకున్నారనుకుంటున్నావా? తన మూలంగా నీ చెల్లెలి పెళ్ళి తప్పిపోయిందన్న న్యూనతాభావంతో, మగ పెళ్ళివారిని స్వయంగా కలిసి నీ మంచితనాన్నీ, నీ ఆర్థిక స్థోమతని వివరించి వారి న్యాయమైన కోరికల్ని ఓ సహోదరుడిగా తానే భరిస్తానని ఒప్పించిన 'దేవుడు' సత్యం!''

ఈ నిజానికి చిదంబరం నోట మాటలేదు. అతడి కళ్ళు కృతజ్ఞతాభావంతో సత్యంని చూస్తూ వర్షిస్తున్నాయి.

మళ్ళీ అందుకున్నాను.

''యికపోతే, రంగారావూ! నీకొచ్చిన సన్మానం ఛాన్సు సత్యం మూలంగా మిస్సయిందా? నిజమే! అయ్యుండొచ్చు! కానీ నిన్ను సన్మానించవచ్చిన ఆ 'కళామాత' సంఘం ఎలాంటిదో నీకు తెలుసా? సన్మానం దుగ్దున్న వారిని వెదుక్కుంటూ వెళ్ళి వారి నుండి డబ్బెదురు తీసుకుని సన్మానం చేసే సంస్థయ్యా అది! అతిథుల నుండి ప్రేక్షకులవరకు కిరాయికి తీసుకొచ్చి వారిచే చప్పట్లు కొట్టించే బాపతయ్యా! అటువంటి సన్మానమా నువ్వు కోరుకునేది?'' సూటిగా ప్రశ్నించాను.

రంగారావు మౌనం దాల్చాడు.

కాసేపు ఊపిరి పీల్చుకుని మళ్ళీ నేనే అందుకున్నాను.

''మన సత్యంకి నీ ప్రతిభాపాటవాలు ఏంటో బాగా తెలుసు. నువ్వు నూటికి నూరుపాళ్ళూ సన్మానానికి అర్హుడవేనని ఎప్పుడో అనుకున్నాడు. అందుకే ఊర్లోని పెద్ద పెద్ద రచయితలను స్వయంగా కలసి వారిని అతిథులుగా ఆహ్వానించి వారి చేతుల మీదుగా నీకు సన్మానం చెయ్యాలని ఎప్పుడో నడుం బిగించాడు. ఆ వివరాలు ఈ కరపత్రాలలో ఉన్నాయి. స్వయంగా నువ్వే చూసుకో, విషయం అర్థమౌతుంది. కాకపోతే, నిన్ను సర్ప్రైజ్ చెయ్యాలనే నీకీ విషయాన్ని ముందుగా చెప్పలేదు సత్యం''

రంగారావు తలదించుకున్నాడు. స్వయాన రచయితై వుండీ, సత్యంని అర్థం చేసుకోలేకపోయినందుకు సిగ్గుపడ్డాడు.

'సత్యం' అన్న పేరుని కూడా ఉచ్చరించే అర్హత తమకి లేదని తెలుసుకుని కాలనీవాసులు మెల్లగా అక్కడి నుండి కదిలారు.

వీటన్నిటికీ అతీతంగా సత్యం తన సహజ ధోరణిలో నలుగురితో ప్రవర్తిస్తుండటం చూస్తే నాకు ముచ్చటేసింది. ☆

## అదో అట్రాక్షన్ మరి!

**జూనియర్ ఎన్టీఆర్ చూడ్డానికి మరీ పెద్దాడిలా కనిపిస్తాడే గానీ మొన్నీమధ్యనే పాతికేళ్లకి చేరుకున్నాడు. అలాంటి కుర్రాడు తనకన్నా వయసులో పెద్దవాళ్లయిన ముద్దుగుమ్మలతో డాన్సులు చేయడం ఆ సినిమాకి అదో అట్రాక్షన్ మరి! 'సింహాద్రి'లో రమ్య కృష్ణతో డాన్స్ చేసిన జూనియర్ ఎన్టీఆర్, ఇప్పుడు 'యమదొంగ' సినిమాలో రంభతో స్టెప్పులేస్తున్నాడు. ఈ స్పెషల్ సాంగ్ ఆ సినిమాకి ఓ అట్రాక్షన్ అవుతుంది మరి!**

